



కన్నీళ్లు తుడిచేందుకు..

కూటమి ప్రభుత్వం కొత్త నిర్ణయం

ప్రజల వద్దకే అధికారులు

ఈనెల 15 నుంచి గ్రామసభలు

వైసీపీ భూదందా బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం

హిందూపురం, ఆగస్టు 12: స్వాతంత్ర్యం ఏర్పడ్డాక ఏ ప్రభుత్వంలో జరగని విధంగా గత వైసీపీ హయాంలో విచ్చలవిడిగా భూదందాలకు పాల్పడ్డారు. ఒకరి భూమి మరొకరికి పాసుపుస్తకాలు చేయడం, 1బీలు మార్చడం వంటివి లెక్కలేనన్ని చేశారు. 2020 నుంచి సార్వత్రిక ఎన్నికల ముందు వరకు పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో దాదాపు భూసమస్యలే ఉండడం గమనార్హం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వంక పోరంబోకు, ఆలయ మాన్యం, అసైన్డ్ భూములను అధికారులు.. వైసీపీ నాయకులకు ధారాదత్తం చేశారు. కొన్నిచోట్లయితే యజమాని గ్రామంలో లేకపోతే చాలు.. పట్టాభూములు కూడా వైసీపీ నాయకులు బోగస్ డాక్యుమెంట్లతో కొట్టేశారు. గ్రామాల్లో భూరికార్డులను తారుమారు చేసి, అవినీతికి పాల్పడ్డారు. ప్రభుత్వ భూమి అనేది లేకుండా చేయాలనీ, సర్వం సొంతం చేసుకోవాలని అన్నివిధాలా ప్రయత్నించారు. ప్రైవేటు భూములను కూడా వదల్లేదు. నిజమైన హక్కుదారుడున్నా రికార్డులో పేర్లు మార్చి ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టించారు. దీంతో జీవనాధారమైన భూములను కోల్పోయిన బాధిత కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అధికారులకు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకున్న పాపానపోలేదు. గత ఐదేళ్లూ కన్నీళ్లు పెట్టుకోవడం తప్ప.. ఏం చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వైసీపీ భూరాబందుల బాధితులు ఊరూరా బయటికొస్తున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోవాలని చూస్తున్నారు. న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఇటీవలిగా నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో సైతం వైసీపీ భూదందాపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూకబ్జాల బాధితుల కన్నీళ్లు తుడిచే దిశగా చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి ఊరూరా గ్రామసభలు నిర్వహించనుంది. భూసమస్యల పరిష్కారమే ఈ సభల నిర్వహణ లక్ష్యం. దీంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో రెవెన్యూ మాటలు వింటే చిరాకే..

గత వైసీపీ పాలనలో రెవెన్యూ వ్యవస్థ భ్రష్టుపట్టిందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఎంతగా అంటే రెవెన్యూ పేరు ఎత్తితేనే జనం చీదరించుకునేలా వ్యవహరించారు. పల్లెల్లో భూములంటే అమితమైన ప్రేమ. ఎలాంటివారైనా గ్రామంలో ఒక్క అడుగు స్థలం వదలాలన్నా.. ఇష్టపడేవారు కాదు. గత వైసీపీ హయాంలో పల్లెల్లో భూసమస్యలు అమాంతం పెరిగిపోయాయి. అధికారులు గ్రీవెన్స్ నిర్వహిస్తే ఎక్కువగా భూసమస్యలపైనే ఫిర్యాదులు వచ్చేవి. రెవెన్యూ అధికారులపై నమ్మకంలేక కొంతమంది జనం కోర్టును ఆశ్రయిస్తున్నారు.

విచ్చలవిడిగా భూదందాలు

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో భూదందాలకు కొదవలేదు. ఊరూరా భూఆక్రమాలే. చిలమత్తూరు మండలంలో ఓ వైసీపీ నాయకుడి మాట రెవెన్యూ అధికారి తీసుకుని 30 ఏళ్ల క్రితం రిజిస్టర్ వీలునామా రాసిన భూమిని సైతం మరొకరి పేరుపైకి మార్చడానికి సన్నద్ధమయ్యారు. ఎన్నికలు రావడంతో అది వాయిదా పడింది. చిలమత్తూరు మండలకేంద్రానికి ఆనుకుని హిందూపురం ప్రధాన రహదారి పక్కన రెండెకరాల అసైన్డ్ భూమికి వైసీపీ నాయకులు పట్టా చేయించుకున్నారు. చిలమత్తూరు మండలంలో కొన్నిచోట్ల వైసీపీ నాయకులు వంద ఎకరాల అసైన్డ్ భూమిని తమ పేర్లమీద చేయించుకున్నట్లు సమాచారం. గతంలో ఆ మండలంలో పనిచేసిన ఇద్దరు, ముగ్గురు తహసీల్దార్లు.. వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇలా.. భారీఎత్తున ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులకు అప్పగించినట్లు తెలిసింది. లేపాక్షి మండలంలో ఓ ప్రజాప్రతినిధి బంధువు ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించే నాయకుడు భారీఎత్తున అసైన్డ్ భూమిని తన పేరున చేయించుకున్నట్లు సమాచారం. మరికొందరు వైసీపీ నాయకులు కొన్ని పంచాయతీల్లో విలువైన భూములను రాయించుకున్నారు. హిందూపురం మండలం, పట్టణ పరిధిలోని ఆలయ భూములను సైతం వైసీపీ నాయకులు కొట్టేయడానికి ప్రయత్నించారు. వైసీపీ నాయకులే ఆక్రమించుకున్నట్లు అప్పట్లో వైసీపీ నాయకులు సమావేశం ఏర్పాటు చేసి మరీ.. చెప్పారు.

గ్రామసభల నిర్వహణకు సన్నాహాలు



గత వైసీపీ హయాంలో పేదలు అనుభవించిన కష్టాలను గుర్తించి, కూటమి ప్రభుత్వం వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతోంది. వైసీపీ హయాంలో.. పేదలు, ప్రభుత్వ భూములే లక్ష్యంగా అక్రమార్కులు చెలరేగిపోయారు. అప్పట్లో అధికారం అండగా అక్రమార్కులు విచ్చలవిడిగా రికార్డులు మార్చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇంత జరిగినా అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో సింహభాగం భూసమస్యలపైనే ఫిర్యాదులు అందినట్లు గుర్తించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా భూసమస్యలు వెల్లువెత్తాయి. దీంతో భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామసభలు నిర్వహించి, అక్కడే పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

15న శ్రీకారం

ఈనెల 15వ తేదీన బృహత్తర కార్యక్రమం మొదలుకానుంది. 45 రోజులపాటు అధికార యంత్రాంగం.. ప్రజల ముగింటకు వెళ్లనుంది. ఏరోజు ఏగ్రామంలో సభలు ఏర్పాటు చేస్తారో రెవెన్యూ అధికారులు ముందుగానే తెలియజేస్తారు. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌ఓ, సర్వేయర్, మండల నోడల్ అధికారి.. గ్రామసభలో పాల్గొంటారు. జిల్లాస్థాయి నోడల్ అధికారి పర్యవేక్షిస్తారు. ఇందులో అన్నిరకాల భూసమస్యలకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తారు. అక్కడికక్కడే పరిష్కారమయ్యే భూసమస్యలను నివృత్తి చేస్తారు. 45 రోజుల్లో సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తారు. భూకబ్జాలు, ఆక్రమణలు, రికార్డుల తారుమారు, రీసర్వేతో వచ్చిన సమస్యలపై గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అర్జీలు తీసుకుని వదిలేద్దామంటే కుదరదు. ప్రతి సమస్యను లోతుగా పరిశీలించి, చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశిస్తోంది. రెవెన్యూ గ్రామసభల్లో భూఆక్రమణల బాగోతం బద్దలుకానుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాపాలపుట్ట పగలనుందని జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వినతిపత్రాలను చూపుతున్న బాధితులు

ఇళ్ల స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారు

న్యాయం చేయండి..

జిల్లా ఎస్పీకి బాధితుల వినతి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 12: చిన్నచిన్న వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకుంటూ కూడబెట్టుకున్న డబ్బుతో కొనుక్కున్న ఇళ్ల స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారనీ, వారిబారి నుంచి విడిపించి, తమకు ఇప్పించాలని హిందూపురానికి చెందిన బాధితులు.. జిల్లా ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు అందజేశారు. అనంతరం బాధితులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. హిందూపురం పొలం సర్వే నంబరు 405-2సీలో 2006లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు.. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో కుమ్మక్కై, నకిలీ పత్రాలను సృష్టించారు. 47 ఇళ్ల స్థలాలను కబ్జా చేశారని బాధితులు వాపోయారు. దీనిపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదని ఆవేదన చెందారు. అంతటితో ఆగని వైసీపీ నాయకులు గతనెల 8న అక్రమంగా లేఅవుట్‌లో ప్రవేశించి, సరిహద్దు రాళ్లను పెకలించి, ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీని సైతం ధ్వంసం చేశారన్నారు. నిలదీసేందుకు ప్రయత్నిస్తే తమపై దాడులకు దిగుతున్నారని బాధితులు వాపోయారు. వైసీపీ నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసులు వారి అనుచరుల దౌర్జన్యాల నుంచి తమను కాపాడాలని ఎస్పీని కోరారు. భూకబ్జాపై విచారణ చేయించి, తమకు న్యాయం చేయాలని ఎస్పీకి విన్నవించుకున్నారు. ఫిర్యాదుచేసిన వారిలో రమేష్, రాఘవేంద్ర, నాగప్ప, అమర్‌నాథ్, ప్రసాద్, శ్రీనివాసులు, వేణుగోపాల్, సుమతి, సుష్మా ఉన్నారు.

విజిలెన్స్ కలకలం..

పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో సోదాలు

రికార్డుల పరిశీలన.. అవినీతిపై ఫిర్యాదులు అందడంతోనే: ఏఓ



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పుట్టపర్తి, ఆగస్టు 12: జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఏఓ వాసుప్రకాష్ ఆధ్వర్యంలో ఏజీఓ శివప్రసాద్, డీసీటీఓ విజయలక్ష్మి, కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. 2022 నుంచి భవనాల ప్లాన్లకు సంబంధించిన అప్రూవల్ రికార్డులు, ప్రాపర్టీ ట్యాక్స్ ఫైళ్లు, వాహనాల డీజిల్ బిల్లులు, 2017 నుంచి సత్యసాయి జయంతి వేడుకలకు చేసిన ఖర్చుల వివరాలు, డస్ట్‌బిన్లు, రోడ్ల బిల్లులు, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, సిబ్బంది మధ్య విభేదాలు కూడా తెలెత్తాయి. సిబ్బంది మూకుమ్మడి సెలవుపై వెళ్లారు. విజిలెన్స్ తనిఖీలతో అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో అవినీతిపై ఫిర్యాదులు అందడంతోనే దాడులు చేసినట్లు విజిలెన్స్ ఏఓ వాసుప్రకాష్ తెలిపారు. అవసరమైతే మరోమారు తనిఖీ చేస్తామన్నారు. నివేదికను రాష్ట్ర అధికారులకు పంపుతామని ఆయన తెలిపారు.

ల్యాండ్, శాండ్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తాం

జిల్లా ఎస్పీ రత్న ఉద్ఘాటన

సివిల్ పంచాయితీల్లో తలదూర్చొద్దని పోలీసులకు ఆదేశాలు



పుట్టపర్తిరూరల్, ఆగస్టు 12: ఇసుక, భూమాఫియాకు అడ్డుకట్ట వేస్తామని జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదనీ, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. గోరంట్ల, ధర్మవరం పట్టణాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. భూకబ్జాలపై పోలీసులు పారదర్శకంగా విచారణ చేపట్టి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.

తరగతి గదిలోనే గాఢనిద్ర

మాస్టారు.. గుర్.. గుర్..

ఖాళీగా కూర్చుండిపోయిన విద్యార్థులు

పాఠశాలలో నిద్రపోతున్న ఉపాధ్యాయుడు రామాంజులు



తనకల్లు, ఆగస్టు 12: తరగతి గదిలో విద్యార్థులు ఏమాత్రం పరధ్యానంగా ఉన్నా.. ఉపాధ్యాయుడు అప్రమత్తం చేస్తూనే ఉంటాడు. వాళ్లు శ్రద్ధగా పాఠాలు వినేలా చూస్తుంటాడు. అలాంటి ఉపాధ్యాయుడే నిద్రపోయాడు. అదీ తరగతి గదిలోనే. చిన్నారులు ఖాళీగా కూర్చుండిపోయారు. మండలకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పరాకువాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదిలో ఉపాధ్యాయుడు రామాంజులు నిద్రపోయాడు. ఆయన గాఢనిద్రలో ఉన్న వీడియో వైరల్‌గా మారింది. ఉపాధ్యాయుడు సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తరగతి గదిలో గురకపెట్టి నిద్రపోవడం కనిపించింది. గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు వీడియోలు తీసి, సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఉపాధ్యాయుడి తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా గురకపెట్టి నిద్రపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై ఎంఈఓ లలితమ్మను వివరణ కోరగా.. పాఠశాల సమయంలో ఉపాధ్యాయుడు నిద్రపోవడంపై విచారణచేసి, శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.



ఖాళీగా కూర్చున్న విద్యార్థులు

పాడిరైతులను ఆదుకోండి

పుట్టపర్తి, ఆగస్టు 12: పాల సేకరణను ఆపేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామనీ, వెంటనే ఆదుకోవాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వేమనారాయణ ఆధ్వర్యంలో పాడిరైతులు.. పాలనే నేలపై పోస్తూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. పాలసేకరణను కొనసాగించి, తమను ఆదుకోవాలనీ, లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు విశ్వేశ్వరరావు, అమరావతి, మహేశ్, మంజు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద పాలను పారబోసి నిరసన తెలుపుతున్న రైతులు

దైవచింతనకు సమయం కేటాయించండి

నందమూరి వసుంధరాదేవి.. ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నందమూరి వసుంధరాదేవి

హిందూపురం, ఆగస్టు 12: ప్రతిఒక్కరూ దైవచింతన కోసం కొంత సమయాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి అన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద సోమవారం వేకువజామున లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ భూమిపూజకు వసుంధరాదేవి హాజరయ్యారు. హోమాలు, పూజల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. పట్టణ నడిబొడ్డున నరసింహస్వామి ఆలయాన్ని నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. బాలకృష్ణకు నరసింహస్వామి అంటే అమితమైన భక్తి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డా.సురేంద్ర, శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణం రెపరెపలాడాలి

జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవాన ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి పరేడ్ మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాన్నారు. జెండాను చేతబూని జాతీయ సమగ్రతను చాటాలన్నారు. అంతకుముందు నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు 262 అర్జీలు సమర్పించారు. వాటిని స్వీకరించిన కలెక్టర్.. పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నేతృత్వంలో రూపొందించిన 'మీకు తెలుసా' కార్యక్రమంపై పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. హెచ్ఐవీ, సుఖవ్యాధుల గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

వైద్యులకు అవార్డులు

వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ తాత్కాలిక, శాశ్వత పద్ధతుల గురించి ఇటీవల నిర్వహించిన విస్తృత అవగాహన కార్యక్రమాల్లో ఉత్తమసేవలు అందించిన వైద్యులు, సిబ్బంది, దంపతులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో డాక్టర్లు ప్రత్యూష (కదిరి) ప్రథమ, డాక్టర్ నీరజ (హిందూపురం) ద్వితీయ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విభాగంలో డాక్టర్ హుస్సేన్ (కదిరి), ఆర్ఎంఎన్ సీహెచ్ కౌన్సిలర్ సునీత, శ్రీవిద్య, ఏఎన్ఎంలు అనురాధ, అమరావతి, దంపతుల విభాగంలో తబుష్షుం, ఆమె భర్త ఫయాజ్, ముస్కాన్ ఆమె భర్త షామీర్‌కు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, వైద్యఆరోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.

జింకను మింగిన కొండచిలువ



జింకను మింగుతున్న కొండచిలువ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 12: మండలంలోని సున్నంపల్లి పరిధి కదిరి-హిందూపురం ప్రధాన రహదారి సమీపాన అడ్డగుట్టలో భారీ కొండచిలువ సోమవారం జింకను మింగేసింది. గ్రామానికి చెందిన కాపరులు.. తమ గొర్రెలను మేపు నిమిత్తం అడ్డుగుట్టలోకి తోలుకెళ్లారు. భారీ కొండచిలువ.. జింకను మింగుతుండడాన్ని గమనించారు. వీడియో తీశారు. భయంతో అక్కడి నుంచి వచ్చేశారు. జింకను మింగేసిన కొండచిలువ గుట్టలోనే ఉంటుందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

డీఎస్ఓపై ఫిర్యాదు

పుట్టపర్తి, ఆగస్టు 12: జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (డీఎస్ఓ) వంశీకృష్ణారెడ్డి పెట్రోల్ బంకుకు అనుమతిచ్చేందుకు డబ్బు డిమాండ్ చేసినట్లు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో చంద్రశేఖర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. నల్లమాడ మండలం రెడ్డిపల్లి వద్ద పెట్రోల్ బంకుకు అనుమతుల కోసం రూ.2 లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికే రూ.లక్ష చెల్లించాననీ, పొరంబీ ఇవ్వడానికి మరో రూ.రెండు లక్షలు అడుగుతున్నారని వాపోయాడు. తన తరువాత దరఖాస్తు చేసుకున్న వారిక త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తున్నారనీ, అన్ని అర్హతలున్నా తనకు మాత్రం అనుమతులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని కలెక్టర్ ఎదుట చంద్రశేఖర్ వాపోయాడు. డీఎస్ఓ ప్రస్తుతం సెలవులో ఉన్నట్లు సమాచారం.

అట్లెట్ల అవుతుంది ?

- 'సర్దుబాటు' కాని వ్యవహారం
- 31 మండలాల్లో టీచర్ల సర్దుబాటుకు కౌన్సెలింగ్
- తప్పుల తడకగా వేకెన్సీలు, సర్‌ప్లస్ వివరాలు
- బహిష్కరించిన టీచర్లు, సంఘాల నేతలు
- తప్పులు సరిదిద్దాలంటూ డీఈఓ ఆఫీస్‌కు...
- సవరణకు రెండు రోజుల అవకాశం: డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు 12: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై టీచర్లు, సంఘాల నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. టీచర్ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు జిల్లావ్యాప్తంగా సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. అయితే స్కూళ్ల వివరాలు, ఉపాధ్యాయుల ఖాళీలు, సర్‌ప్లస్ తదితర వివరాలు సక్రమంగా లేవని, అడ్డగోలుగా ఉన్నాయంటూ ఉపాధ్యాయులు, సంఘాల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. చాలా మండలాల్లో కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు సంఘాల నాయకులు, టీచర్లు ప్రకటించారు. ఎంఈఓలను, జిల్లా విద్యాశాఖాధికారులను కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. దీంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. లోపాలు, టీచర్ల గ్రీవెన్స్‌లను సవరించడానికి ఎంఈఓలకు రెండు రోజులు అవకాశం కల్పించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు...

ఉపాధ్యాయుల సర్దుబాటుకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది.



డీఈఓ ఆఫీస్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన టీచర్లు

సోమవారం జిల్లాలోని అన్ని మండలాల్లో టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈక్రమంలో విద్యాశాఖ కమిషనరేట్ నుంచి అన్ని మండలాల్లో ఉన్న మిగులు టీచర్లు, అవసరమైన టీచర్లు, వారి సీనియారిటీ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచారు. అయితే చాలా మండలాల్లో ఉపాధ్యాయుల వివరాలు, పోస్టుల సంఖ్య, ఖాళీలు చూపడంలో పొరపాట్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అనేక మండలాల్లో టీచర్లు ఆందోళన చెందారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులను కలుపుకుని ఎంఈఓలను కలిసి కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, పెద్దపప్పూరు ఇలా అనేక మండలాల్లో ఎంఈఓలను కలిసి సమస్యలను ఏకరువుపెట్టారు. ఉపాధ్యాయ సర్దుబాటు అశాస్త్రీయం, అసంబద్ధంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. జీఓ 117 రద్దు చేసిన తర్వాత సర్దుబాటు ప్రక్రియ నిర్వహించాలని కోరారు.


టీచర్లు, హెచ్ఎంలు డీఈఓ ఆఫీస్ బాట...

మండలాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగానే చాలా మంది టీచర్లు, ప్రధానోపాధ్యాయులు డీఈఓ ఆఫీస్ బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా మిగులు టీచర్లు 1023 మంది, అవసరం (నీడ్) 585 మంది అంటూ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉందని జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. అయితే ఇచ్చిన సమాచారంలో లోపాలు ఉన్నాయంటూ పలువురు టీచర్లు, హెచ్ఎంలు డీఈఓ ఆఫీస్‌కు వచ్చిన ఫిర్యాదు చేశారు. బండమీదపల్లిలోని జడ్పీహైస్కూల్‌లో పనిచేసే టీచర్ స్కూల్ అసిస్టెంట్ కాగా... ఆయన ఎస్ఐఈటీగా చూపారంటూ ఫిర్యాదు చేశారు. సర్దుబాటు ప్రక్రియ నుంచి ఫేస్ 2 స్కూళ్లను మినహాయించారు. అలాంటి స్కూళ్లలోని టీచర్లను సైతం సర్‌ప్లస్ చూపారు. ఇదే సమస్యపై కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఓ స్కూల్ హెచ్ఎం డీఈఓ ఆఫీస్‌కు వచ్చి సమస్యను విన్నవించారు. ఇలా అనేక మంది టీచర్లు డీఈఓ ఆఫీస్ బాటపట్టారు. ఈనెల 16 వరకూ టీచర్ల నుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తామని, తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించేలా విద్యాశాఖ కమిషనర్ స్పష్టం చేసినట్లు తెలిసింది. కౌన్సెలింగ్, సర్దుబాటు ప్రక్రియను ఈనెల 16 వరకూ వాయిదా వేశారన్న దానిపై జిల్లా విద్యాశాఖాధికారులు ధ్రువీకరించడం లేదు. ఉత్తర్వులు రాలేదంటూ...చెబుతున్నారు. దీనిపై వివరణ కోసం డీఈఓ వరలక్ష్మికి ఫోన్ చేయగా టీచర్ల నుంచి వచ్చే గ్రీవెన్స్‌ల సవరణకు రెండు రోజులపాటు ఎంఈఓలకు విద్యాశాఖ కమిషనర్ అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు. సవరణల తర్వాత కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.



పెద్దపప్పూరులో ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు

హేమావతి, శ్రీకాళహస్తి మధ్య పర్యాటక వలయం



ముఖ్యమంత్రికి పర్యాటక వలయం గురించి వివరిస్తున్న మైనాస్వామి (ఫైల్)

గోరంట్ల, ఆగస్టు 12: శ్రీ సత్యసాయి జిల్లా హేమావతి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వరకు ఆలయ పర్యాటక వలయం అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించినట్లు చరిత్ర పరిశోధకుడు, పర్యాటకరంగ నిపుణుడు మైనాస్వామి తెలిపారు. స్థానిక మాధవరాయస్వామి ఆలయంలో సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. జలీవల అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి పలు విషయాలు చర్చించినట్లు తెలిపారు. పర్యాటక వలయం సీఎం సానుకూలంగా ఉండటంతో పూర్తి స్థాయి నివేదికను త్వరలో అందజేస్తున్నారు. ఈపర్యాటక వలయం హేమావతిలోని సిద్దేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమై పెనుకొండ, లేపాక్షి, గోరంట్ల, మేడిపల్లి, మల్లెల, కదిరి, సోమపాళ్యం, వాయల్పాడు, శ్రీనివాస మంగాపురం, చంద్రగిరి, తిరుపతి, గుడిమల్లం, శ్రీకాళహస్తి ప్రసిద్ధ ఆలయంతో ముగుస్తుందన్నారు. ఈ వలయంలో ప్రముఖ ఆలయాలు, కోటలు, రాజభవనాలు, చారిత్రక ప్రదేశాలున్నాయన్నారు. పర్యాటక వలయంలో రోప్‌వే మార్గాలు, (రోప్‌వే) సౌండ్అండ్ లైటింగ్, లేజర్‌షో, పురావస్తు ప్రదర్శన శాలలు, పర్యాటక లఘు చిత్రాల ప్రదర్శన కేంద్రాలు, పిల్లల పార్కుల ఏర్పాటు, వసతి, మౌలిక సదుపాయాల కల్పన, రవాణ సౌకర్యాలు మెరుగుపరిచే అభివృద్ధి కార్యక్రమాలుంటాయన్నారు. వలయం అభివృద్ధి పరచడానికి దాదాపు రూ.ఐదువందలకోట్లు అవసరమని, నిధులను వివిధ పథకాలద్వారా కేంద్ర ప్రభుత్వం సమకూర్చుతుందని ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. ఆలయ పర్యాటక వలయం ఏర్పాటుతో ఆయా ప్రాంతాల అభివృద్ధితో పాటు వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

జేఎన్‌టీయూలో భారీగా బదిలీలు



అనంతపురం సెంట్రల్, ఆగస్టు 12: జేఎన్‌టీయూ నూతన యాజమాన్యం బాధ్యతలు చేపట్టిన నెలలోనే భారీగా బదిలీలకు శ్రీకారం చుట్టింది. గత వైసీపీ పాలనలో పారదర్శకతకు పాతరవేస్తూ రాజకీయ సిఫార్సులు, ప్రజా ప్రతినిధుల అండదండలున్న వారికి పెద్దపీటవేశారు. వైసీపీ నాయకుల కాళ్లావేళ్ల పనులను అడ్డదిడ్డంగా చక్కదిద్దేందుకు, స్వార్థ ప్రయోజనాలు ఒనగూర్చేలా గత వర్సిటీ యాజమాన్యం పలువురిని కీలక పోస్టుల్లో నియమించింది. ఈ వ్యవహారంపట్ల అప్పట్లో వర్సిటీ వర్గాలు అభ్యంతరాలు తెలిపినా పెడచెవిన పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పారదర్శకతకు పెద్దపీట వేశారని పలువురు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

20మందికి టీచింగ్, నలుగురు బోధనేతర సిబ్బంది...

జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య సోమవారం 20మంది టీచింగ్, నలుగురు నాన్‌టీచింగ్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు, బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్(డీఈ)గా ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు, ఓఎస్‌డీ టు వీసీగా దేవన్న, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ విశాలి గౌర్నాడే, ఓటీపీఆర్ నూర్‌మహమ్మద్, డీపీ సెక్షన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా లింగప్ప నియమితులయ్యారు. ప్రొఫెసర్ చెన్నకేశవరెడ్డి అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ప్రొఫెసర్ వసుంధర వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. స్థానాల వారిగా ఉద్యోగోన్నతి, బదిలీ వివరాలు...

పేరు	ప్రస్తుత విభాగం	పదోన్నతి/బదిలీ
ప్రొఫెసర్ దేవన్న	కెమిస్ట్రీ	ఓఎస్‌డీ టు వీసీ
ప్రొఫెసర్ సత్యనారాయణ	ప్రిన్సిపాల్, అనంతపురం	డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్
ప్రొఫెసర్ చెన్నారెడ్డి	కంప్యూటర్ సైన్స్	ప్రిన్సిపాల్, అనంతపురం
నాగప్రసాద్ నాయుడు	మెకానికల్, కలికిరి	డైరెక్టర్, ఎవాల్యుయేషన్
ప్రొఫెసర్ విశాలి గౌర్నాడే	సివిల్, అనంతపురం	డైరెక్టర్, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్
ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి	కంప్యూటర్‌సైన్స్, అనంతపురం	డైరెక్టర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్
ప్రొఫెసర్ భానుమూర్తి	సివిల్, అనంతపురం	డైరెక్టర్, ఐసీఎస్
ప్రొఫెసర్ ప్రశాంతి	మెకానికల్, డైరెక్టర్, అనంతపురం	ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్
ప్రొఫెసర్ పద్మసువర్ణ	ఫిజిక్స్, అనంతపురం	ఇన్‌చార్జ్ డైరెక్టర్, స్పాన్సర్డ్ రీసర్చ్
ప్రొఫెసర్ ఎస్.వైశాలి	ఈఈఈ, అనంతపురం	డైరెక్టర్, ఐకార్ అండ్ పి
ప్రొఫెసర్ శివకుమార్	కంప్యూటర్‌సైన్స్, అనంతపురం	కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
డాక్టర్ శ్రీధర్	ఈఈఈ, అనంతపురం	అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
డాక్టర్ అంకారావు	ఈఈఈ, అనంతపురం	అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్
ప్రొఫెసర్ అరుణకాంతి	సివిల్, అనంతపురం	ప్రిన్సిపాల్, పులివెందుల
ప్రొఫెసర్ వసుంధర	కంప్యూటర్‌సైన్స్, అనంతపురం	వైస్ ప్రిన్సిపాల్, అనంతపురం
డాక్టర్ ఓం ప్రకాష్	మెకానికల్, అనంతపురం	వర్సిటీ పీఆర్వో
డాక్టర్ అరుణ మస్తాని	ఈఈఈ, అనంతపురం	కోఆర్డినేటర్, అకడమిక్ అండ్ ప్లానింగ్
ప్రొఫెసర్ రమణారెడ్డి	ఈసీఈ, అనంతపురం	ఈసీఈ, కలికిరి
ప్రొఫెసర్ నగేష్‌కుమార్	ఈఈఈ, అనంతపురం	ఈఈఈ హెచ్, కలికిరి
నాగమణి	ఏఆర్, అనంతపురం	ఏఆర్, కలికిరి
నూర్ మహమ్మద్	ఏఆర్, అనంతపురం	వీసీ పేషీ
లింగప్ప	ఏఆర్, పులివెందుల	ఏఆర్, డీపీ సెక్షన్
సునీల్ కుమార్	వీసీ పేషీ	సూపరింటెండెంట్, డీఏఈ

పంపకాల్లో తేడా.. దొరికిన దొంగలు



గొడవపడి దొరికింది వీరే..

బత్తలపల్లి, ఆగస్టు 12: చోరీ చేసిన సొత్తు పంపకాల్లో తేడాలు కారణంగా మనస్పర్ధలు వచ్చి ముగ్గురు మహిళలు పట్టుబడ్డారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన మోహన్ భార్య రాధమ్మ బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలోని బంధువుల ఇంటికి రెండ్రోజుల క్రితం వచ్చింది. సోమవారం ధర్మవరం వెళ్లి, బీరువు కొనుగోలు చేసింది. అక్కడి నుంచి బత్తలపల్లికి బస్సులో వచ్చింది. బస్సు దిగాక ఆమె మెడలోని 20 తులాల బంగారు నగలను తీసి, బ్యాగులో పెట్టుకుంది. మడుగుపల్లి వెళ్లేందుకు నార్పల బస్సు ఎక్కింది. బస్సులో ముగ్గురు మహిళలు... ఆమెను మాటల్లో పెట్టారు. ఆమె దృష్టి మరల్చి బ్యాగులోని బంగారాన్ని కొట్టేశారు. మాల్యవంతం గ్రామంలో ఆ ముగ్గురు మహిళలు బస్సు దిగి, వెళ్లిపోయారు. బస్సు తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లికి చేరుకున్నాక రాధమ్మ.. తన బ్యాగులోని బంగారాన్ని చూసుకోగా.. కనిపించలేదు. ఆమె బోరున విలపిస్తూ విషయం బస్సు డ్రైవర్‌కు తెలిపింది. వెంటనే బస్సు వెనక్కి తిప్పి బత్తలపల్లికి చేరింది. నార్పల వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారుడిని ఆపి, విషయం తెలిపింది. అతడు.. ఆమెను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని మాల్యవంతంలో దిగిన మహిళల గురించి ఆరాతీయగా.. వారు బత్తలపల్లి వైపు ఆటోలో వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. అక్కడి నుంచి బత్తలపల్లికి చేరుకున్నారు. గ్రామ శివార్లలోని నర్సరీల వద్ద ముగ్గురు మహిళలు బంగారు పంపకాలవిషయంలో తీవ్ర రావడంతో పరస్పరం దాడి చేసుకుంటున్నారు. అటుగా వెళ్తున్నవారు పోలీసులకు సమాచారం అందించారు. అంతలోనే బాధిత మహిళ రాధమ్మ.. ఆ మహిళలను గుర్తించి, వారివద్దకు వెళ్లి వారిస్తుండగా పోలీసులు అక్కడకు చేరుకుని, విచారించారు. మహిళా దొంగలను స్టేషన్‌కు తరలించి, చోరీ చేసిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మహిళలను విచారించగా.. సర్దిన సమాచారం ఇవ్వడంలేదని తెలుస్తోంది.

8వ పీఆర్సీ వేయాలి: ఎంయూ

గుంతకల్లు, ఆగస్టు 12: పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించి, వెంటనే 8వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ని నియమించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొత్త పింఛను విధానాన్ని విడనాడి, పాత పింఛనుని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేయకుండా 8వ పీఆర్సీని నియమించి వేతన సవరణలు చేయాలన్నారు. 2016 నుంచి రైల్వే ఉద్యోగుల కేడర్ రీఆర్గనైజేషన్ చేయాలని, పెండింగులో ఉన్న 18 నెలల కరువు భత్యాన్ని విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ ఏడీఈఎస్ ఆశ్వని, కోశాధికారి శ్రీనివాస శర్మ, నాయకులు రాజశేఖర్, శీన, ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

స్టేషన్ మాస్టర్ల సంఘం..

స్టేషన్ మాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఎస్ఎం, ఎస్ఎం ఆర్‌ల డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ డివిజనల్ అధ్యక్షుడు రవిశంకర్, సంయుక్త కార్యదర్శి రఫూఖ్ బాషా, నాయకులు పెద్దన్న, సుందరం, హరిప్రసాద్, సునీల్, దీపక్, మహేశ్వరి, సర్వాజ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై పునరాలోచించాలి: షకీల్ షఫి



సమావేశంలో మాట్లాడుతున్న షకీల్ షఫి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 12: వక్ఫ్ సవరణ చట్టం-2024పై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని, ముస్లిం మతపెద్దలతో చర్చలు జరపాలని రాష్ట్ర ముతవల్లీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి డిమాండ్ చేశారు. ఏపీ ముతవల్లీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలో సోమవారం నిర్వహించిన అఖిలపక్ష చర్చావేదికలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని పాలకులు విభజించు. పాలించు అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ముస్లింలను అణగదొక్కేందుకు హిజాబ్, ఎన్ఆర్‌సీ వంటి చట్టాలను తీసుకొచ్చారని విమర్శించారు. ఇవి చాలవన్నట్లు ఇప్పుడు కొత్తగా వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చి ముస్లిం సామాజికవర్గాన్ని హరించేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ముస్లింలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని, ఐక్య పోరాటాలు చేసి తమ హక్కులను కాపాడుకుంటామని అన్నారు. ముస్లిమేతరులను వక్ఫ్‌బోర్డులో చేర్చే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ముతవల్లీలు, మత పెద్దలతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముస్లింల సంక్షేమం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఆక్రమణకు గురైన 60శాతం వక్ఫ్ భూములను తిరిగి వక్ఫ్‌కే చెందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకునేవరకూ ఐక్య పోరాటాలు సాగిస్తామని, అవసరమైతే ఢిల్లీ వరకు పోరాటం సాగిస్తామని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ రిజ్వాన్ అన్నారు. మసీదుల్లో బయాన్ కన్నా ముందు వక్ఫ్‌పై అవగాహన కలిగేలా ప్రచారం కల్పించాలని, ఆ మేరకు ముతవల్లీలు చొరవ చూపాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాదాగాంధీ సూచించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, మున్సిపల్ మాజీ చైర్మన్ నూర్‌మహ్మద్, టీడీపీ నాయకుడు తాజుద్దీన్, ఐఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, అవాజ్ వలి, సైపుల్లా, ఎంఎండీపీ ఇమామ్, సీనియర్ న్యాయవాది రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేదో బాగుందే !

- బ్రహ్మజెముడు సాగుతో లాభాలు
- పంటకు నీటి వినియోగమూ తక్కువే
- ఎరువులు, మందుల అవసరం లేదు
- పశువుల మేతగా ఆకులు, కొమ్మలు



బ్రహ్మజెముడు పంట

గుత్తిరూరల్, ఆగస్టు 12: ఆరేళ్ల కిందట తీవ్ర కరువు ఏర్పడి పశువుల మేత కూడా దొరకని దుస్థితి నెలకొంది. ఆ సమయంలో గ్రాసం కొరతను కొద్దిమేర తగ్గించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో డీఆర్‌డీఏ, వెలుగు సంస్థ బ్రహ్మజెముడు అనే కొత్తరకం సాగుకు శ్రీకారం చుట్టింది. అయితే రైతులు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. చివరికి గుత్తి మండలం ఊటకల్లు గ్రామంలో వెంకటేశ్వర రెడ్డి అనే రైతు ముందుకు రాగా.. ఆ రైతు చేత బ్రహ్మజెముడు పంటను సాగు చేయించింది. పూణే నుంచి వాటి మొక్కలు తెప్పించి మరీ సాగు చేయించింది. జిల్లాలోనే తొలిసారిగా ఆ రైతు రెండు ఎకరాల పొలంలో ఆయన 2100 మొక్కలను నాటారు. ఒక్కో మొక్కను ఆరు అడుగుల దూరంలో నాటారు. ఒక్కసారి సాగు చేస్తే కొన్నేళ్లుగా పంట అలాగే ఉంటుంది.

మొక్కకు లీటరు నీరు పోస్తే చాలు

బ్రహ్మజెముడు సాగుకు నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. నాటిన రోజు నుంచి 15 రోజులకొకసారి ఒక్కో మొక్కకు ఒక లీటరు నీరు పోయాలి. ఆ తర్వాత మొక్క ఎదుగుదల బట్టి నీటిని పోయాలి. మొక్క బతికిన తర్వాత నీటిని పోయాల్సిన అవసరం లేదు. ఈ పంటకు ఎరువులు, మందులు కూడా అవసరం ఉండదు. వర్షాలు లేకున్నా బెట్ట పరిస్థితిని తట్టుకుని మొక్కలు ఎదుగుతాయి. ఎటువంటి నేలల్లో అయినా దీన్ని సాగు చేసుకోవచ్చు.



విరగ్గాసిన బ్రహ్మజెముడు పండ్లు

పాడి పశువులకు మేతగా..

బ్రహ్మజెముడు ఆకులు, కొమ్మలను పశువులకు మేతగా ఎంతో ఉపయోగపడతాయి. వాటి ఆకులను, కొమ్మలను ముక్కలుగా చేసి దాణాగా వాడుకోవచ్చు. వాటి ఆకుల్లో, కొమ్మల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కనుక పాడి పశువుల్లో పాల దిగుబడి పెరగడానికి ఈ గ్రాసం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇతర ప్రాంతాలకు సరఫరా



నేను రెండు ఎకరాల్లో బ్రహ్మజెముడు పంటను సాగు చేశాను. ఒక్కో ఆకు రూ. 30 నుంచి రూ.40 వరకు అమ్ముతాను. విజయవాడ, వినుకొండ, హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు కూడా ఈ ఆకులను సరఫరా చేశాను. అయితే వీటి పండ్లకు డిమాండ్ తక్కువగా ఉంది. ప్రభుత్వం బ్రహ్మజెముడు పండ్లను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు దిగుమతి చేయాలి. రైతులకు ఆదాయం చేకూరుతుంది.

- వెంకటేశ్వర్ రెడ్డి, రైతు, ఊటకల్లు

ఐదు రోజులు వానలు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 12: రానున్న ఐదు రోజులు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం పలు చోట్ల కురిసే అవకాశం ఉందని రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీల్లో అనంత చిన్నారికి రజతం



రజతం సాధించిన చిన్నారి హత్విక్

అనంతపురం విద్య, ఆగస్టు 12: జాతీయ స్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో అనంతపురం నగరానికి చెందిన చిన్నారి హత్విక్ రెడ్డి వెండి పతకం సాధించాడు. నగరంలోని సరస్వతి విద్యామందిర్‌లో రెండో తరగతి చదువుతున్న హత్విక్‌రెడ్డి ఈ నెల 6వ నుంచి 11వ తేదీ వరకూ తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 5-7 ఏళ్ల విభాగంలో పాల్గొన్నాడు. పోటీల్లో సత్తా చాటి..రజత పతకం సాధించాడు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ రోలింగ్ స్కేటింగ్ అకాడమీలో కోచ్ అంజనేయులు దగ్గర శిక్షణ పొందాడని, నేషనల్ స్థాయిలో పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు.

గురుకులాల్లో ఖాళీలు లేవు

అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 12: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సీట్లు ఖాళీ లేవని అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ సీట్లు ఖాళీలేవన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశాలకు లాగ్‌సెట్ నిర్వహించి మెరిట్ లిస్టు ప్రకారం సీట్లను భర్తీ చేశామన్నారు. మిగిలిన సీట్లను ప్రజాప్రతినిధులు, అనాథల నుంచి వచ్చిన గ్రీవెన్స్‌ను పరిశీలించి మెరిట్ ప్రకారం రిజర్వేషన్ పద్ధతిన అడ్మిషన్లు కేటాయించామన్నారు. అయితే జిల్లాలో సీట్లకు ఎక్కువ డిమాండ్ ఉన్న నేపథ్యంలో లోకల్ గురుకులాలకు 10 సీట్లు పెంచాలని గురుకుల పాఠశాల సెక్రటరీకి జిల్లా కలెక్టర్ ప్రతిపాదించారన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మెరిట్ ప్రకారం సీట్లను భర్తీ చేస్తామన్నారు. కలెక్టర్ కాకుండా డీసీఓ కార్యాలయానికిగానీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు రావద్దన్నారు. ఇంటర్‌లో నల్లమాడ, బ్రహ్మసముద్రం, ఉరవకొండ గురుకులాల్లో సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీలలో ఖాళీలు, మార్కుల ఆధారంగా నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం



కేఎస్ఎన్ కళాశాలలో విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధ్యాపకులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 12: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి కౌన్సెలింగ్‌లో ఉమ్మడి జిల్లాలో 13 ప్రభుత్వ, 60 ప్రైవేట్ కళాశాలలకు 10వ సీట్లను కేటాయించారు. అలాట్‌మెంట్ అయిన విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో 16వ రిపోర్ట్ చేసుకోవాలి. విద్యార్థులు ఇచ్చుకున్న ఆప్షన్ల మేరకు వారి ఇంటర్మీడియట్ మార్కులు, కేటగిరి, మెరిట్ ఆధారంగా ఆటోమేటిక్ కంప్యూటరైజ్డ్ పద్ధతిలో సీట్ల కేటాయింపు ఉంటుంది. అయితే నచ్చిన కళాశాల, కోర్సులు కాకుండా ద్వితీయ ఆప్షన్లలో అలాట్‌మెంట్ అయిన విద్యార్థులు చేరాలా వద్దా? అంటూ సందిగ్ధంలో పడుతున్నారు. కళాశాలకెళ్లి భౌతికంగా రిపోర్ట్ చేయకుండానే కేటాయించిన సీటు రద్దు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. తొలి కౌన్సెలింగ్ ప్రక్రియ అనంతరం నిర్వహించే ద్వితీయ కౌన్సెలింగ్‌లో మరోసారి నచ్చిన కళాశాల, కోర్సులకు ఆప్షన్లు ఇచ్చుకోవాలంటే.. ప్రస్తుత అలాట్‌మెంట్ అయిన సీట్‌లో అడ్మిషన్ అవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

సిఫార్సులకు సీట్లు దక్కవు...

వర్సిటీల వారిగా వాటి పరిధిలోని కళాశాలలకు ఆఫ్‌లైన్ అడ్మిషన్లు చేసుకునే ప్రక్రియకు ముగింపు పలికి, రాష్ట్ర వ్యాప్తంగా ఏక కాలంలో ఆన్‌లైన్ విధానం కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్, అలాట్‌మెంట్ ఇలా మొత్తం ప్రక్రియ కంప్యూటరైజ్ అయిపోయింది. ప్రతిభ ఆధారంగా విద్యార్థి స్థానిక ప్రాంతంలోని కళాశాలకు సీటు అలాట్‌మెంట్ అవుతోంది. ఈ నేపథ్యంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులకు అడ్మిషన్ ప్రక్రియలో ఏమాత్రం సంబంధం ఉండదు. ఈ విషయం తెలియక గత వైసీపీ ప్రభుత్వంలో డిగ్రీ సీట్లు కావాలని సిఫార్సు చేసేవారు. అదే పరిస్థితి ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, వారి అనుయాయులు కొనసాగిస్తున్నారని కళాశాలల అధికారులు వాపోతున్నారు. తమ చేతుల్లో ఏమీలేదని వివరించినా మినిస్టర్ల చెప్పించిరా అంటూ ఒత్తిడి చేస్తుండటంతో జవాబివ్వలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లకు అల్లుకున్న పచ్చని తీగలు

అల్లుకున్న ప్రమాదం

నల్లమాడ: మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఇలా పిచ్చి తీగలు అల్లుకున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆసుపత్రికి, చుట్టు పక్కల నివాస గృహాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. పచ్చని తీగలు ఇలా అల్లుకొని ఉండటంతో... వాటి ద్వారా విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదముందని స్థానికులు వాపోతు న్నారు. వర్షాకాలంలో ఇలా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే తీగలను తొలగించాలని కోరుతున్నారు.



శకుంతల

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

నల్లచెరువు, ఆగస్టు 12: మండల ఎంపీడీఓ శకుంతల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇతర జిల్లాలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన ఆమె.. సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ బదిలీపై సొంత జిల్లా కర్నూలు వెళ్లారు. ఆమె స్థానంలో శకుంతల బాధ్యతలు చేపట్టారు.

అమడగూరు ఎంపీడీఓగా మునియప్ప



మునియప్ప

కదిరి(అమడగూరు) : అమడగూరు మండల ఎండీపీఓగా మునియప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల సమయంలో ఆయన మంత్రాలయానికి బదిలీపై వెళ్లారు. ఎన్నికల కోడ్ ముగియడంతో యథాస్థానికి ఆయన బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న అశోక్‌కుమార్‌రెడ్డి బదిలీపై పుట్టపర్తి వెళ్లారు.

టీడీపీ వర్గీయుడిపై గొడ్డలితో దాడి



గాయపడిన శ్రీనివాసులు

ధర్మవరం, ఆగస్టు 12: మండలంలోని తుంపర్తి గ్రామంలో టీడీపీ వర్గీయుడిపై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. తుంపర్తి గ్రామానికి చెందిన పరమేశ్ ఆయన బావమరిది నరసింహులు సోమవారం సాయంత్రం టీడీపీ వర్గానికి చెందిన శ్రీనివాసులు, నారాయణ స్వామిపై బూతులు తిడుతూ దౌర్జన్యానికి దిగారు. ఇదేమని ప్రశ్నించినందుకు నారాయణస్వామి గొడ్డలితో శ్రీనివాసులపై దాడి చేశాడు. శ్రీనివాసులు గ్రామంలోకి పారిపోయి ప్రాణాలను రక్షించుకున్నాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని గ్రామస్థులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పరిశే సుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, బీజేపీ నాయకులు హరీశ్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి.. శ్రీనివాసులను పరామర్శించారు.

అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలి

కొత్తచెరువు, ఆగస్టు 12: మండల కేంద్రంలో ఎంతోమంది నిరుపేదలకు గత ప్రభుత్వ ం రాజకీయంతో పట్టాలు ఇవ్వలేదని అలాంటి పేద వారిని గుర్తించి ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు బ్యాళ్ల అంజి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ...చాలా మంది పేదలకు ఆన్‌లైన్‌లో ఇళ్లప ట్టాలు మంజూరైతే వారికి కొండల్లో, గుట్టల్లో ఇళ్లపట్టాలు ఇచ్చారని వైసీపీ కార్యకర్తలకు మైదానంలో, రోడ్డు పక్కన విలువైన స్థలాలను ఇచ్చారన్నారు. వాటిని రూ.5లక్షలదాకా అమ్ముకున్నారన్నారు. అలాంటి వాళ్లను గుర్తించి ఆ ప్లాట్లను రద్దుచేసి పేదలకు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కదిరి అర్బన్, ఆగస్టు 12: విధులకు అలస్యంగా వస్తూ నిర్లక్ష్యం చేస్తున్న స్థానిక ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కళాశాల వద్ద విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్ కళాశాలకు రోజు ఆలస్యంగా వస్తుండటంతో.. అధ్యాపకులు, సిబ్బంది విధులకు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర, మల్లికార్జున, మహేంద్ర, రెడ్డిదర్శన్ సుమంత్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

కదిరి అర్బన్, ఆగస్టు 12: ఏఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని కదిరిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు వేమయ్యయాదవ్ మాట్లాడు తూ... విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కే దక్కుతుంద న్నారు. కార్యక్రమంలో మహేంద్ర, అశోక్, గణేష్, సాయి, రాజేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినం

ధర్మవరం రూరల్, ఆగస్టు 12: స్థానిక గ్రంథాలయంలో సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీఎస్ఆర్ రంగనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను అధికారులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలీ సౌభాగ్యవతి, సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మవరం రూరల్: స్థానిక రాంనగర్‌కు చెందిన చేనేత కుటుంబానికి చెందిన బాలం సాలమ్మ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించింది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేనందువల్ల రంగరాజు శిల్క్ హౌస్ యాజమాని బంగాడు నాగరాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, సాకే ఓబిలేసు వెళ్లి రూ. ఐదు వేలను ఆమె కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతామంజునాథ్, గరుగు మల్లికార్జున, నాగరాజు, గోవిందాచారి, దాము, ముత్యాలగౌడ్ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కదిరి, (అమడగూరు) : అమడగూరు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునియ్యప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు నివేదికలతో హాజరుకావా లన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామని, సమావేశానికి ఎంపీటీసీ, జడ్పీటీసీలు, అన్నిశాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని అన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

ధర్మవరం, ఆగస్టు 12: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు రూ.10వేల విలువైన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాసామగ్రిని ఆత్మీయ ట్రస్టు సభ్యులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ ట్రస్టు ప్రతినిధులు మేడాపురం రామిరెడ్డి, శెట్టిపి జయచంద్రారెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శైలజ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తనకల్లు : మండలంలోని కోటపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ బాల్యవివాహ, బాలికా విద్య, బాలికల హక్కులు, బాధ్యతలు, చట్టాల తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, సమత స్వచ్ఛందసంస్థ ప్రతినిధి మౌనిక, ఉపాధ్యాయులు వేమనారాయణ, శ్రీనివాసులు, మహమ్మద్‌రఫీ,అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, సాయిలక్ష్మీ, స్వరూప, శోభారాణి, అంజినమ్మ పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి

నల్లమాడ : ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులందరూ పంటనమోదు చేయించుకోవాలని ఏఓ సుమతి సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి పంటకు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని, అలా చేయించుకున్న రైతులకే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని అన్నారు. తేదీలవారీగా ఆయా పంచాయతీలో పంటనమోదు చేస్తారన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

- లేఅవుట్లు వేసి.. విక్రయిస్తున్న అక్రమార్కులు
- దండుబాట, హమాలీకాలనికి దారి గల్లంతు



ఎర్రగుంటపల్లి సమీపంలో ప్రభుత్వ స్థలంలో వేసిన లేఅవుట్



దండుబాట దారి

కదిరి, ఆగస్టు 12: ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. లేఅవుట్లు వేసి మరీ విక్రయించి.. సొమ్ము చేసుకొంటున్నారు. గత ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వంలో ప్రైవేటు భూముల పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఅవుట్లు వేశారు. అధికారులకు ఈ విషయం తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. చివరకు కాలనీకు వెళ్లే దారి కూడా లేకుండా లేఅవుట్లు వేసుకుని అమ్మేశారు. ఇంతజరుగు తున్నా మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ అధికా రులు చోద్యం చూస్తున్నారే తప్పా.. పట్టించుకో లేదు. కూటమి ప్రభుత్వం అయినా ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు..

ప్రైవేటు భూముల పక్కనే ఉన్న ప్రభుత్వ భూములు ఉంటే చాలా.. కలిపేసుకుని లేఅవుట్లు వేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటపల్లి నుంచి కుర్మవాండ్లపల్లి వెళ్లే రహదారిలో ఎర్రకుంట ఉంది. ఈ కుంటకు వెనుక భాగాన, ప్రభుత్వ స్థలం దాదాపు 70 సెంట్లుకుపైగా ఉంది. దీని పక్కన ప్రైవేటు స్థలం ఉండడంతో ఆ స్థలంలో పాటు ప్రభుత్వ స్థలాన్నీ కలుపుకుని పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ప్లాట్లు వేశారు. ఇది జరిగి కూడా రెండు సంవత్సరాలైంది. అయినా అధికారులు పట్టించుకోలేదు. చివరకు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు. ఈప్రభుత్వ భూమి విలువ దాదాపు రూ. కోటికిపై మాటే. ఈ స్థలంలో ఇప్పటికే పేపర్ లేఅవుట్లు వేసి, ప్లాట్లు వేసి... అన్ని అమ్మివేసినట్లు సమాచారం. దీనిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థాని కులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

దండుబాట ఏదీ

కదిరి నుంచి పూర్వం కదిరి కొండకింద వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లడానికి రాజులు దండుబాట ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. అక్కడ నుంచి ఇక్కడికి వెళ్లడానికి ప్రభుత్వ రికార్డులు కూడా దండుబాటను సూచించారు. ప్రస్తుతం ఆ దండుబాట ఎక్కడుందో కనిపించని పరిస్థితి. దాదాపుగా దండుబాట మాయమైంది. దండుబాటను ఆక్రమించుకొని... ఇళ్లను కూడా నిర్మించుకున్నారు. ఈ దండుబాట పూర్తిగా ఆక్రమణకు గురైనట్లు విమర్శలున్నాయి.

> **చర్యలు తీసుకుంటాం**
>
> మున్సిపాలిటీలో ప్రభుత్వం భూమిలో వేసిన లేఅవుట్లను పరిశీలిస్తాం. అవి అక్రమమని తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.
>
> - కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

హమాలీకాలనీకి దారెక్కడ?

కుమ్మరవాండ్లపల్లికి సమీపంలో హమాలీ కాలనీ ఉంది. ఈ కాలనీకి వెళ్లడానికి ప్రస్తుతం దారి లేదు. పూర్వమున్న దండుబాటలోనే నడుస్తు న్నారు. అయితే రాయచోటి, కదిరి రోడ్డులో నుంచి దండుబాట మీదగా కాలనీలోకి వెళ్లడానికి ప్రస్తుతం దారి ఉంది. ఇటీవల కొంతమంది తాము ఈ స్థలాన్ని కొన్నామంటూ కాలనీకి వెళ్లే దారిలో ప్లాట్లకు పునాదులు తీయడానికి ప్రయత్నంచారు. దీన్ని తెలుసుకున్న కాలనీవాసులు ఇది దండుబాట అని, ప్లాట్లు వేసి ఇళ్లు నిర్మించడానికి వీలు లేదని వారితో వాగ్వివాదం చేశారు. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు వెనుదిరిగినట్లు సమాచారం. ప్రభుత్వ దండుబాటను ఎవరు అమ్మారనేది తెలియాల్సి ఉంది. దీంతో పాటు హమాలీకాలనీకి వెళ్లడానికి దారి చూపించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది.

పని సర్దుబాటు వాయిదా వేయండి

కొత్తచెరువు, ఆగస్టు 12: జిల్లాలో ప్రస్తుతం చేపడు తున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటును వాయిదా వేయాలని పదోన్నతులు చేపట్టిన తరువాతే ఆ ప్రక్రియ చేపట్టాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల ఎస్టీయూ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని విద్యాశాఖ ఏడీ--1 నాగరాజుకు అంద జేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...117 జీఓ నెంబ రును రద్దు చేసీ జీఎం నెంబరు 53 ప్రకారం ఉద్యోగో న్నతులతో పాటు సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎంలు, పీడీ పోస్టులు మంజూరుచేయాలని, పని సర్దుబాటును మండలంలోనే చేపట్టాలని, జిల్లాలో పెం డింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శంకర నారాయణ, అనిల్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్యాప్టో నాయకులు: జీఓ నెంబరు 117ను రద్దు చేసి జీఓ నెంబరు 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, ముందుగా ఖాళీలను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ప్యాప్టో నాయకులు కోరారు. ఈ మేరకు ఆ నాయకులు సోమవారం వివిధ సమస్యలపై స్థానిక ఎంఈఓ జయచంద్రకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... పనిసర్దుబాటు అనేది ఎక్కువగా మండలానికే పరిమితం చేయాలన్నారు. 2025 ఏప్రిల్ 30 లోగా రిటైర్ అవుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌చంద్ర, కోనంకి సుధాకర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మవరం: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్యాప్టో, ఏపీటీఎఫ్ నాయకులు ఎంఈఓ-2 గోపాల్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు బీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు కె.బల రాముడు, రవీంద్రరెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. పరిస్థితి విషమించక ముందే ప్రస్తుత ప్రభుత్వం మేల్కొని సమస్యలను చక్కదిద్దాలన్నారు. జీఓ నెంబర్ 117 రద్దు చేసి జీఓ ఎంఎస్ నెంబరు 53 తేదీ ప్రకారం టీచర్లను కేటా యించాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీతోపాటు 1 నుంచి 5వ తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షావిధానం అమలు చేయాలని, ఉన్నతపాఠశాలలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు, నాయకులు ఆంజనేయులు, రామక్రిష్ణనాయక్, పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన 117 జీవోను రద్దు చేయాలని జాక్టో నాయకులు కోరారు. ఎంఈఓ సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ... జీవో నంబరు 117 ప్రకారం చేస్తున్న అసంబద్ధతమైన పని సర్దబాటును బహిష్కరించాలన్నారు. 2020లో అమల్లో ఉన్నా జీవో నెం.53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్ బిల్డింగ్‌కు అవకాశం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జాక్టో చైర్మన్ గౌస్‌లాజం, ఎపిటిఎఫ్ రామ్‌కుమార్, యూటీఎఫ్ మనోహర్, వైఎస్ఆర్‌టీఎఫ్ శ్రీనివాసులు, డీటీఎఫ్ సుధాకర్‌నాయక్, చంద్రమౌలి, చంద్రమోహన్, ఎంటీఎస్ ఉపాధ్యాయులు క్రిష్ణప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

నంబులపూలకుంట: రాష్ట్రంలో ప్రభుత్వం 117, 128 జీవోలను రద్దు చేసి, 2020లో విడుదల చేసిన జీవో నెంబర్ 53 ప్రకారం పనిసర్దుబాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎమ్మార్పీ కార్యాలయంలో ఎంఈఓ సుబ్బిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రమణనాయక్, మురళి, శివయ్య, షరీఫ్, రఫీ, ముషీర్ అహమ్మద్, వెంకటరమణారెడ్డి, రమణయ్య, రహీమ్,వెంకటరామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామమోహన్, లాలూసాబ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో డీజిల్ కుంభకోణం

విచారణ చేపట్టాలని సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కృపాకర్‌రెడ్డి

కదిరి, ఆగస్టు 12: మున్సిపాలిటీలో భారీ ఎత్తున డీజిల్ కుంభకోణం జరిగిందని, దీనిపై విచారణ చేపట్టాలని మున్సిపల్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కౌన్సిల్ హాల్‌లో మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఛైర్‌పర్సన్ నజీమున్నిషా అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషర్ కిరణ్‌కుమార్, సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంగానే దాదాపు నాలుగు నెలల అజెండాను సమావేశంలో ఛైర్‌పర్సన్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా 4వార్డు కౌన్సిలర్ కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ... జూలై 2023 నుంచి జూలై 2024 వరకు డీజిల్ బిల్లులు ఇవ్వాలని మున్సిపల్ డీఈ విజయ్‌కుమార్‌ను కోరగా, ఫైల్స్ ఛైర్‌పర్సన్ ఇంటిలో ఉన్నాయని, వారంలో తెప్పించిస్తామని సమాధానం ఇచ్చారు. మున్సిపాలిటీలో ఉండాల్సిన ఫైల్ ఛైర్‌పర్సన్ ఇంటిలో ఎందుకున్నాయని పలువురు సభ్యులు ప్రశ్నించారు. మున్సిపాలిటీలో పెద్దఎత్తున డీజిల్ కుంభకోణం జరిగిందని, సమగ్రంగా విచారణ జరపాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ... వారం లోపు వివరాలు మొత్తం అందరికి తెలియజేస్తామని చెప్పారు. ఏడో వార్డు కౌన్సిలర్ కిన్నెరకళ్యాణ్ మాట్లాడుతూ... జరిగిపోయిన పనులను, జరుగుతున్నట్లు చూపించడం సరికాదన్నారు. మున్సిపాలిటీలో ప్రతి పని ఇష్టారాజ్యంగా చేస్తున్నారని తెలిపారు. కౌన్సిల్ ఆమోదం తరువాత ఎటువంటి వివరాలు సభ్యులకు తెలియడంలేదన్నారు. మున్సిపల్ స్టాడింగ్ కౌన్సిల్‌లో బాధ్యతవిధంగా ఉండేవారిని నియమించాలని సభ్యులు కోరారు. షాపు గదులు ఇష్టారాజ్యంగా అద్దెకిచ్చారని, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ



పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

కదిరి, ఆగస్టు 12 : పట్టణంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాల, కాళసముద్రం గురుకుల పాఠశాలను డీఈఓ మీనాక్షి సోమవారం తనిఖీ చేశారు. వివిధ పాఠశాలలో సీబీఎస్ఈ సిలబ స్సను ప్రవేశపెడుతున్న సందర్భంగా విద్యార్థులు ఈ సిలబస్‌ను చదవడానికి, ముందుగా పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాలు తెలుసుకోవడానికి ట్యాబ్‌లో ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష నిర్వాహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాలకు వెళ్లి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వ హించే గిరిజన నృత్యాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, అధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఆలయ ఈఓకు విరాళం అందజేస్తున్న భక్తులు

ఆలయాభివృద్ధికి విరాళం

నల్లచెరువు, ఆగస్టు 12: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో బావిలోబావి చేదబావి మరమ్మతులకు కదిరి పట్టణంలోని సైదాపురం అమృత ఫంక్షన్‌హాల్ యజమాని కొలిమినేని నిర్మల, శ్రీకాంత్‌నాయుడు రూ.1,10,116 విరాళం అందజేశారు. సోమవారం ఈ విరాళాన్ని ఈఓ రవీంద్రరాజుకు అందజేశారు. గతంలో ఈ బావిలోని నీటిని స్వామివారి అభిషేకాలు, నైవేద్యాలకు వినియోగించేవారు. ఆ బావిలో పూడిక, ముళ్లపొదలు పేరుకుపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని గమనించిన దాతలు దాని మరమ్మతులకు విరాళం అందజేశారు. దాతలకు ఆలయ ఈఓ స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.

అనాథాశ్రమంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరు అనాథ శ్రమంలోని 40 మంది వృద్ధులకు రూ. 20వేల విలువ చేసే దుప్పట్లను బీజేపీ నాయకులు సోమవారం అందజేశారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ కుమార్తె సంస్కృతి పుట్టినరోజు సందర్భంగా వీటిని పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత నాయ కులు గిర్రాజు నగేష్, గొట్లూరు అనిల్, వెంకటేష్, నరసింహులు, అన్వర్, బిల్లే శ్రీనివాసులు, జింకా చంద్రశేఖర్, సాకే ఓబిలేసు, మల్లికార్జున పాల్గొన్నారు.

బీసీ న్యాయవాదుల సంఘం ఏర్పాటు



మాట్లాడుతున్న బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకే నరేశ్

ధర్మవరం, ఆగస్టు 12: స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో బీసీ న్యాయవాదుల జిల్లా స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మేకల రామాంజినేయులు, ఉపాధ్యక్షుడిగా కురుబ బస్నీల మహేశ్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారిగా కిశోర్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా బిల్లే నరేంద్ర, మరో 36 మంది న్యాయవాదులను కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకే నరేశ్ మాట్లాడుతూ... సత్యసాయి జిల్లాలో ఉన్న బీసీ న్యాయవాదులకు మూడు సెంట్లలో స్థలం కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వం పీపీ, ఏపీపీ, ఏజీపీల పోస్టుల కేటాయింపులలో బీసీలకు సముచిత స్థానం ఇవ్వాలని అన్నారు. బీసీ న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వ్యాసరచన పోటీలు

కదిరి అర్బన్, ఆగస్టు 12: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కదిరి డివిజన్ నుంచి దాదాపు వంద మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. జీవవైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కుమ్మరవాండ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థిని హేమావతి మొదటి స్థానం, తలుపుల జిల్లాపరిషత్ విద్యార్థిని గాయత్రి రెండో స్థానం, కదిరి బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థి గణేష్ మూడో స్థానంలో నిలిచారు. విజేతలకు జిల్లా సైన్సు అధికారి తనూజ్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, క్రిష్ణమూర్తి, మధన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాసమస్యలు పరిష్కరించండి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 12: ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జి ఆర్ఐ భరత్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన వారు మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని, స్థానిక బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, మండలకేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాములు, కుళ్లాయప్ప, కేశవ, శ్రీనివాసులు, మిట్టపల్లి శ్రీరాములు, జయమ్మ, వరలక్ష్మి, అంజనమ్మ, తులసమ్మ, గంగరత్న, శ్రీదేవి, శాంతమ్మ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

ధర్మవరం, ఆగస్టు 12: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై శక్తిమైత్రి మహిళ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి ప్రధాన రహదారుల ద్వారా సాగింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మాధవి, ఐసీటీసీ వైద్యాధికారి నజీర్, గైనకాలజిస్టు వైద్యురాలు శైలజ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కొత్తచెరువు, ఆగస్టు 12: పుట్టపర్తికి చెందిన శ్రావణ్ తన పుట్టినరోజు సందర్భంగా మండలంలోని భైరాపురంక్రాస్ సాయినగర్ మండల ప్రాథమిక పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు రూ. ఐదు వేల విలువైన విద్యా సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. పలకలు, రైడింగ్‌ప్యాడ్స్, నోట్ పుస్తకాలు, పెన్సిల్ తదితర వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కిజ్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు షాకీర్, శివ, జావిద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



అలంకరణలో లక్ష్మీకాంత తీర్థుల బృందావనం

పెనుకొండ, ఆగస్టు 12: పట్టణసమీపంలో వెలసిన లక్ష్మీకాంత తీర్థుల మందిరంలో స్వామి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ, తీర్థప్రసాద వినియోగం చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు. నిర్వాహకులు పాలూరి కృష్ణమూర్తితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జ్యోతుల ఉత్సవం

గుడిబండ: మండలంలోని ఎస్ఎస్‌గుండ్లులో వెలసిన ఏడు మంది అక్కమ్మగార్ల ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మండలంలోని ఎస్.రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్‌గుండ్లు, గ్రామాల్లోని ప్రజలు అమ్మవారికి మహిళలు హారతులు మోసి గ్రామస్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన పలువురు ఎంపీడీఓలు సోమవారం వారికి కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. గోరంట్ల ఎంపీడీఓగా రఘునాథ్‌గుప్త బాధ్యతలు స్వీకరించారు. కాగా గోరంట్ల తహసీల్దార్ అక్బల్ బాషాను కడపజిల్లా బద్వేల్ ఆర్డీఓ కార్యాలయం ఏఓగా నియమించడంతో ఆయన డీటీ రెడ్డి శేఖర్‌కు బాధ్యతలు అప్పగించి వెళ్లిపోయారు. డీటీ రెడ్డిశేఖర్ గోరంట్ల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా పరిగి ఎంపీడీఓగా సరస్వతి, చిలమత్తూరు ఎంపీడీఓగా నరేష్, గుడిబండ ఎంపీడీఓగా రామారావు బాధ్యతలు స్వీకరించారు. వారికి ఆయా కార్యాలయాల సిబ్బంది స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మినీ గోకులం షెడ్లకు దరఖాస్తు చేసుకోండి

అగళి, ఆగస్టు 12 : మండలంలో మినీ గోకులాల షెడ్లకు దరఖాస్తులు చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. గోకులం దరఖాస్తుతో పాటు ఫారం రైతు ఫొటో, జాబ్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, ఎస్సీఎస్టీలు అయితే కులధ్రువీకరణ పత్రం జతచేసి ఆయా పశువైద్య కేంద్రాలలో అందజేయాలని సూచించారు. అదేవిధంగా గొర్రెలకు, మేకలకు, కోళ్లఫారాలకు ప్రభుత్వం షెడ్లు మంజూరు చేస్తుందన్నారు. వివరాల కోసం ఆయా పశువైద్య కేంద్రాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌ల తనిఖీ

పెనుకొండ రూరల్, ఆగస్టు 12: పెనుకొండ సమీపంలో జాతీయ రహదారిపై ఇటీవల వాహనాలు పెరగడంతో ప్రమాదాలు జోరందుకున్నాయి. దీంతో డీపీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, కియ ఎస్ఐ రంగడు, ఎంవీఐ అధికారులు సోమవారం పెనుకొండ నుంచి గుట్టూరు వరకు జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై పుట్టపర్తికి వెళ్లే యూటర్న్, హరిపురం వైజంక్షన్, కియ మెయిన్‌గేట్, అమ్మవారిపల్లి స్పీడ్ బ్రేకర్లు, గుట్టూరు వైజంక్షన్ మరో రెండు ప్రాంతాలు కలిపి మొత్తం ఏడుచోట్ల పరిశీలించారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు.

గుడిసెల వద్ద చెత్త వేయకండి : సీపీఐ

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 12: పేదలు వేసుకున్న గుడిసెల వద్ద చెత్త వేయకండని సీపీఐ జిల్లా కమిటీ నాయకులు బాలస్వామి పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో 700సర్వేనంబరులో 3.95 ఎకరాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను అకారణంగా పోలీసులు తొలగించారన్నారు. ఈ విషయం పై హైకోర్టుకు వెళ్లగా స్టే ఇచ్చిందన్నారు. ఈ దిశలో పేదల ఇళ్ల స్థలాల్లో పంచాయతీవారు ట్రాక్టర్ ల నుంచి చెత్తను తెచ్చి డంపింగ్ చేస్తున్నారన్నారు. కోర్టులో ఉన్న అంశాన్ని పరిగణలోకి తీసుకుని చెత్తవేయకుండా ఆపాలన్నారు. అనంతరం పంచాయతీ అధికారి జయరాంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఇళ్లస్థలాల భూసాధన కమిటీ అధ్యక్షురాలు నూర్‌జహాన్, గుర్రమ్మ, రాధమ్మ, అంజినమ్మ, రాములమ్మ, లక్ష్మి, పెన్నఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీవీ-5 కెమెరామన్ శేఖర్ మృతి



అనంతపురం క్రైం, ఆగస్టు 12: టీవీ-5 కెమెరామన్ శేఖర్ (42) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. అనంతపురం నగరం హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న శేఖర్ రాత్రి 9 గంటల సమయంలో తన ఇంట్లోనే గుండెపోటుకు గురై ఒక్క సారిగా కుప్పకూలారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శేఖర్‌కు భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. టీవీ-5 కెమెరామెన్‌గా శేఖర్ గత కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన అత్యక్రియలు బుధవారం నిర్వహిస్తున్నట్లు కటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఆకస్మిక మృతిపై జర్నలిస్టుల సంఘం, కెమెరామెన్ యూనియన్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడికి ఆర్థిక సాయం

గుడిబండ, ఆగస్టు 12 : అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం పాల్తూరు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సత్యవరప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతుండగా... గుడిబండ మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. వారు సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నగదును ఎంఈఓ రవిచంద్రకుమార్‌కు అందజేశారు.

మహిళకు పాముకాటు

గోరంట్ల, ఆగస్టు 12: మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన మహిళ రైతు నంజుడమ్మ సోమవారం పాముకాటుకు గురైంది. వానవోలుకు చెందిన ఆంజనేయుల భార్య నంజుడమ్మ పొలం పనులకు వెళ్తుండగా పొరపాటున చూడకుండా అడుగుపెట్టడంతో కాలిపై పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యంకోసం 108లో పుట్టపర్తికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, ఆగస్టు 12: అనంతపురం కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని అనంతసాగర్ కాలనీలో అప్పుల బాధతో చింతకాయల వీరాంజనేయులు (35) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతసాగర్ కాలనీకి చెందిన చింతకాయల వీరాంజనేయులు టైలర్‌పని చేస్తూ జీవనం సాగించేవాడు. కుటుంబ జీవనం కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తిచెంది సోమవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, ఆగస్టు 12: పట్టణ సమీపంలోని మెడికల్ కళాశాల ఎదురుగా సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో చౌడప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని మావటూరుకు చెందిన చౌడప్ప ద్విచక్రవాహనంలో పని నిమిత్తం పెనుకొండకు వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో పెనుకొండ సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చౌడప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షల నిమిత్తం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

మడకశిర రూరల్, ఆగస్టు 12: వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి వేదపండితులు హోమాలు చేశారు. ఆలయంలో శివలింగం, పార్వతి, సుబ్రహ్మణ్యేశ్వర, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే ధ్వజ స్తంభం, విమానగోపురం కలశ స్థాపన చేశారు. ముందుగా మహిళలు కలశాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎంపీ పార్థసారథి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యేలు ఈరన్న వైటీ ప్రభాకర్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, కర్ణాటక సిద్దరబెట్ట పీఠాధిపతి వీరభద్ర శివాచార్యులు, జపానంద స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో సిద్దరబెట్ట వీరభద్ర శివాచార్య స్వామీజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలని సూచించారు. అప్పుడే వరుణదేవుడు కరుణిస్తాడన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కలశాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వస్తున్న మహిళలు

అసంబద్ధ సర్దుబాట్ల ప్రక్రియ ఆపాలి

- ఫ్యాప్టో నాయకుల డిమాండ్
- కౌన్సెలింగ్ బహిష్కరణ



పురంలో ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 12: ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ అసంబద్ధ సర్దుబాట్లను వెంటనే నిలిపివేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం కూడా చేస్తోందని ఆగ్రహించారు. జీఓ నంబర్117ను రద్దు చేయాల్సిందిపోయి.. అలానే కొనసాగించేలా ప్రవర్తించడం సరికాదన్నారు. జీఓ ఎంఎస్ 53 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. దాదాపు 18 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓకు అందించారు. ఏపీటీఎఫ్ జోనల్ కార్యదర్శి అంజనమూర్తి, నాగరాజు, నారాయణస్వామి, ఆదినారాయణ, యూటీఎఫ్ నాయకులు బాబు, చెన్నకేశవ, ఎస్‌టియూ శ్రీనివాసులు, గోపాల్, సమీవుల్లా, మునిసిపల్ టీచర్స్ నాయకుడు సిద్దగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: ఫ్యాప్టో నాయకులు ప్రస్తుత ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియను వ్యతిరేకిస్తూ, ఉపాధ్యాయ సమస్యలపై పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ సుధాకర్‌కు అందజేశారు. ఫ్యాప్టో చైర్మన్ కోడూరు శ్రీనివాసులు, కోచైర్మన్ సుధాకర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కాడిశెట్టి శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, అమర, చంద్రబాబు కరణం రఘునాథ్‌బాబు, ఆదిదినేష్, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(సోమందేపల్లి): తాత్కాలిక ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో పిలుపుమేరకు సోమవారం ఉపాధ్యాయులు కౌన్సిలింగ్‌ను బహిష్కరించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ ఆంజనేయులు నాయక్‌కు వినతిపత్రం అందించారు.

మడకశిరటౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటును బాయ్‌కాట్ చేస్తున్నట్లు సోమవారం ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ శ్రీనివాసభాస్కర్‌కు అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు భూతన్న, జోగప్ప, చంద్రమోహన్, రామకృష్ణ, మహంతేష్, వెంకటరాముడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు నేడు జరుగుతున్న అసంబద్ధ, అశాస్త్రీయ ఉపాధ్యాయ పని సర్దుబాటును వ్యతిరేకిస్తున్నట్లు మండల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పలు డిమాండ్లతో మండల విద్యాశాఖాధికారులు మోహన్, శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ జోన్ ఉపాధ్యక్షుడు యంజేరప్ప, మండల అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రెడ్డప్ప, గురుమూర్తి, ప్రభాకర్, గంగప్ప, వినోద్, మహేష్, నరేంద్ర, అనీల్, ముష్కిన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఆగస్టు 12 : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరితపిస్తుంటారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బాలాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం వక్క రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర పర్యటన సందర్భంగా వక్క మార్కెట్ ఏర్పాటుకు ఇచ్చిన హామీ విషయమై రైతుల అభిప్రాయాలను తెలుసుకొన్నారు. వక్క మార్కెట్‌ను ఎక్కడ ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలం, వక్కచెట్ల పెంపకం, వక్క తయారీ విధానం, మార్కెటింగ్ సౌకర్యం తదితర విషయాలపై చర్చించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. వక్కమార్కెట్ ఏర్పాటు, ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన, వక్క రైతులకు విద్యుత్ సబ్సిడీ, విదేశాల నుంచి దిగుమతయ్యే వక్క బ్యాన్ తదితర విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని రైతులు సూచించారు. పక్క కర్ణాటక రాష్ట్రంలో ఉపాధి హామీ పథకాన్ని వక్క సాగుకు అనుసంధానం చేశారని, మన రాష్ట్రంలోనూ అందుకు కృషి చేయాలని రైతులు కోరారు. ముఖ్యమంత్రి సూచన మేరకు వక్క రైతుల సంఘం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈసందర్భంగా రైతులు, రైతు సంఘం నాయకులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన న్యాయాధికారి



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిర రూరల్, ఆగస్టు 12: మండలంలోని గుండుమల గ్రామంలో ఉన్న కేజీబీవీని మడకశిర జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఆర్ అశోక్ కుమార్ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదుల పరిశుభ్రత, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో సమస్యలు, విద్యా ప్రగతి, భోజన పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలనీ, పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయలకు సూచించారు.

'ప్రభుత్వం మారినా.. అధికారులు మారలే..'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భర్త

మడకశిర రూరల్, ఆగస్టు 12: కూటమి ప్రభుత్వం వచ్చినా నేటికీ కొంత మంది అధికారుల్లో మార్పురాలేదని ప్రజలు వాపోతున్నారు. మండలంలో 16 పంచాయతీలు ఉండగా... పదిమంది మహిళా సర్పంచులు, తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రొటోకాల్ పక్కనపెట్టి సభలు సమావేశాలకు మహిళా ప్రజా ప్రతినిధుల స్థానంలో వారి భర్తలు, కొడుకులు, బంధువులు హాజరయ్యేవారు. అప్పట్లో అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చింది. అయినా కొంత మంది అధికారుల్లో మార్పురాలేదని ప్రజలు వాపోతున్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శు లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మొదటి రోజు ఎంపీపీ కవితను అధికారులు ఆహ్వానించారు. ఆమె రాకపోవడంతో ఆమె భర్తను ఆహ్వానించారు. ఇద్దరు ఎంపీడీఓలు ఒక ఏఓ ఉన్నా ప్రొటోకాల్ పాటించకుండా ఎంపీపీ భర్తను స్టేజ్ ఎక్కించి సమావేశంలో మాట్లాడించారు. వైసీపీ పాలనలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదు. ప్రస్తుతం అదే ఒరవడిని కొనసాగిస్తున్నారని పలువురు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపికైన మహిళా ప్రజా ప్రతినిధులకు తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులు తీసుకునే అధికారులేరీ?

అర్జీలు ఇచ్చేందుకు జనం పడిగాపులు



అధికారులులేక ఖాళీగా ఉన్న కుర్చీలు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 12 : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసింది. అయితే అధికారులు లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక జనం కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్నారు. అదేవిధంగా మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ నియామకాన్ని చేపట్టక పోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల వేళ వచ్చిన తహసీల్దార్ అంజనాదేవి ఇటీవల బదిలీ అయి సొంతజిల్లాకు వెళ్లారు. అధికారులు సోమవారం గ్రీవెన్స్‌డేకి అలా వచ్చి ఇలా వెళ్లిపోవడతో ఖాళీ కుర్చీలు కార్యాలయంలో దర్శనమిచ్చాయి. డిప్యూటీ తహసీల్దార్ శంకర్ పనిభారాన్ని ఒక్కడే అన్ని తానై నెట్టుకొస్తున్నారు. అయినా ఆయన రైతులు, ప్రజలతో కార్యాలయం బయటకు వచ్చి అర్జీలు స్వీకరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ హెచ్చరిక

లేపాక్షి, ఆగస్టు 12 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ల యజమానులను ఆమె హెచ్చరించారు. మండలంలో అనుమతులు లేకుండా సెలవుదినాల్లో, రాత్రిళ్లు అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్నారని తమకు సమాచారం అందిందన్నారు. ఇకపై అలా తరలిస్తే వాహనాలను సీజ్ చేయడమేకాకుండా కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ల యజమానులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతలు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 12 : గ్రామాల్లో వందశాతం స్వచ్ఛత, పరిశుభ్రతతో పాటు సమర్థవంతంగా చెత్తతో సంపద కేంద్రాల నిర్వహణపై సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పరిసరాల పరిశుభ్రత, వీధిలైట్లు, మంచినీటి పథకాల నిర్వహణ, చెత్తతో సంపద కేంద్రాల నిర్వహణ, సకాలంలో కరెంటు బిల్లులు చెల్లింపు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను తదితర అంశాలపై శిక్షణను చేపట్టారు. కార్యక్రమంలో ఏఓ మురళి, సర్పంచులు, కార్యదర్శులు చేపట్టారు.

అగళి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులు పరిపాలనాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పరిపాలనాధికారి మాట్లాడుతూ పంచాయతీ సర్పంచులు కార్యదర్శులు గ్రామాలలో అభివృద్ధిపై దృష్టిసారించాలని, వచ్చే నిధులను వాటికి ఉపయోగించాలన్నారు.. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, నిధులు, బాధ్యతలు, పరిపాలనా అంశాలు తదితర వాటిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు ఉన్నారు.



సోమందేపల్లిలో శిక్షణ ఇస్తున్న అధికారులు

ఇళ్లను క్రమబద్ధీకరించుకోండి

ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి



ఇంటి పన్ను బిల్లులు అందజేస్తున్న వసుంధరాదేవి

హిందూపురం, ఆగస్టు 12: మునిసిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి సూచించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం ఆవరణంలో సోమవారం ఏర్పాటుచేసిన ఆస్తి పన్ను విధింపు వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వసుంధరదేవి మాట్లాడుతూ... పట్టణంలో నాలుగు వేల మందికిపైగా ఇంటి పన్ను చెల్లించడం లేదన్నారు. అలాంటి వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణంలో ఇంటి పన్ను చెల్లించని వారందరికి అవగాహన కల్పించాల న్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ మంజుల, నాగేంద్రమ్మ, సతీష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

చిలమత్తూరు: గర్భిణులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి పేర్కొన్నారు. ఆమె సోమవారం మండలంలోని చాగలేరు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి హాజరయ్యారు. గర్భిణులకు పసుపు, కుంకుమ, చీరలు అందజేశారు. అనంతరం చాగలేరులో శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు నీరందించారు. టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, జడ్పీటీసీ అనూష, నాయకులు అంజినప్ప, బేకరీ గంగాధర్, కొడికొండ బాలాజీ, నందీషప్ప, అశ్వత్థప్ప, శ్రీదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఉన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేద్దాం



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 12: దేశ భక్తిని చాటుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేద్దామని యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి పిలుపునిచ్చాడు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో చేపట్టిన హర్‌ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, సద్భావన్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఎంఎఫ్‌రోడ్డు మీదుగా చిన్నమార్కెట్ వరకు సాగింది. అక్కడ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు రమేష్‌రెడ్డి, పార్టీ తిరుపతి ఇన్‌చార్జ్ పార్థసారథి, 11వ వార్డు కౌన్సిలర్ అంజలి పాల్గొని మాట్లాడారు. మహిళా మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీగౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్, జిల్లా కార్యదర్శి తిరుమలేష్, ఆదర్శ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు మహాలక్ష్మి తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాలలో మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 12: రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలె సంక్షేమ గురుకుల పాఠశాలలో మరమ్మతు పనులు వేగంగా చేపడుతున్నారు. టీడీపీ స్థానిక నాయకులు సోమవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... ఇటీవల మంత్రి సవిత హాస్టల్‌ను తనిఖీ చేశారన్నారు. పలు సమస్యలును విద్యార్థులతోపాటు సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. మంత్రి స్పందించి తక్షణం మరమ్మతు పనులు చేపట్టాలని పీఆర్ డిపార్ట్‌మెంట్‌ను ఆదేశించడంతో విద్యుత్, టాప్ మరమ్మతులు, వాటర్‌ట్యాంక్ శుభ్రత తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

పాఠశాలకు మైక్ వితరణ

పెనుకొండ రూరల్, ఆగస్టు 12: రొద్దం మండలంలోని సానిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.12వేలు విలువచేసే మైక్ వితరణ చేసినట్లు హెచ్ఎం చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఉపాధ్యాయులు నారాయణస్వామి, కృష్ణానాయక్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ నారాయణ, పూర్వ విద్యార్థులు మల్లికార్జున, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గ్రీన్‌డే

పెనుకొండ, ఆగస్టు 12: స్థానిక గ్లోబుల్‌జెన్ పాఠశాలలో సోమవారం కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్‌డే కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు వివిధరకాల కూరగాయలు, పండ్లు, వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం మంజువాణి, డైరెక్టర్లు సాయి, సృజన, సాయి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 12: అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ 89వ ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక సప్తగిరి కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఘనమైన పోరాట పటిమ కలిగిన విద్యార్థిసంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి :ఎస్ఎఫ్ఐ

పెనుకొండ, ఆగస్టు 12 : డివిజన్‌వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్, నాయకులు సాయితేజ, బాలాజీ, వంశీ, విద్యాసాగర్ తదితరులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. జూనియర్‌కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దారి ఏర్పాటు చేయాలని లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు.